గూడు చేరిన పక్షి

వి ఎస్ చెన్నూరి

సోఫాలో వాలి, టీపాయ్ మీదికి కాళ్ళు బారచాచి సిగరెట్టు దమ్ములాగుతూ దీర్ఘంగా ఆలోచిస్తోన్న రాము డోర్ బెల్ మోగగానే వులిక్కిపడి కుర్చీలోంచి లేచి నిల్చున్నాడు. చేతనున్న సిగరెట్టుని అష్ట్రేలో నొక్కుతూ ఆలోచన్లో పడ్డాడు.

తన కీవూళ్ళో మిత్రులెవరూ లేరు. తన్ను కలుసుకోవలసిన అవసరం ఎవరికీ లేదు అయితే హోటల్ బాయ్, లేదా పోలీసులు, కాకపోతే తన ముఠాలోని వ్యక్తులు:- హోటల్ బాయ్ కాక మిగతా యిద్దర్లో ఎవరైనా తాను చిక్కులో పడ్డట్లే. వాళ్ళని తప్పించుకోవడం తన తరంకాదు. డోర్ బెల్ మోగిన తరువాత తలుపు తెరవక తప్పదు!-

గడియ తీసి తలుపు తెరిచి రాము గుమ్మంలో ప్రత్యక్షమైన వ్యక్తిని చూసి ఆశ్చర్యపోయాడు. తానూహించిన ముగ్గుర్లో ఎవరూ కాదావ్యక్తి!

"ఎవరికోసం?" గుమ్మంలో నిల్చుని ప్రశ్నించాడు.

అతడు చిన్నగా నవ్వాడు. "మీ కోసమే బాబూ, నన్ను లోపలికి రానియ్యి" అన్నాడు.

రాము పక్కకి తొలిగి దారిచ్చాడు. అతడు లోపలికి చేరుకుని "తలుపు మూసి

లోపలికిరా బాబూ! నీతో ఓ రహస్యం మాట్లాడాలి!" అన్నాడు.

రాము ఆశ్చర్యానికి అంతు లేదు. తలుపు మూసి తిన్నగావచ్చి అతని కెదురుగా కూచున్నాడు.

ఆ అపరిచిత వ్యక్తి ఓసారి రాము కేసి ఆపాదమస్తకం పరిశీలనగా చూచి, చిన్నగా నవ్వి "నేను మారువేషం లోవచ్చిన సిఐడీ ఆఫీసరో కావచ్చునని సందేహిస్తున్నావు కదూ," ప్రశ్నార్థకంగా చూసి, "కాదు! నేను నీ శ్రేయోభిలాషిని! నావల్ల నీకెలాంటి ఇబ్బందీ కలగదు! నన్ను నమ్ము బాబూ! పైగా నేను నీ సాయంకోరి వచ్చిన వ్యక్తిని!" అన్నాడు

రాము ఏమీ మాట్లాడలేదు, అతని కంతా వింతగావుంది. ఇతడ్ని ఎక్కడో చూచినట్టుంది. కాని గుర్తుకి రావడం లేదు తానీవూళ్ళో అడుగుపెట్టినప్పటి నుండి తన బుర్ర చెడిపోతోంది. ఈ వీధులూ, ఈ పరిసరాలూ, ఇక్కడి మనుషులూ తనకి పరిచయమైనవాళ్ళు లాగానే కనిపిస్తున్నారు.

"నువ్వెవరో నాకు తెలుసు, నీ గురించి నేనంతా క్షుణ్ణంగా తెలుసుకున్నాను. నీవల్ల నేనో వుపకారం పొందాలని వచ్చాను. నువ్వు నాకు వుపకారం చెయ్యడంవల్ల నువ్వు నీకు వుపకారం చేసుకున్నట్టు కూడావుంటుంది.

రాము గొంతు సవరించుకున్నాడు. "నేను మీకు సాయంచెయ్యడమేమిటి? మీరేం మాట్లాడుతున్నారో నా కర్థం కావడంలేదు" అన్నాడు.

"చెబుతాను." అపరిచిత వ్యక్తి గొంతు సవరించుకున్నాడు "నేను ఒకప్పుడు బాగా బ్రతికినవాడ్ని. ప్రస్తుతం బాగా చితికిపొయ్యాను. నాకు ఒకే పొక్క కూతురుంది. దానిపెళ్ళి కాస్తా అయిందనిపిస్తే నా బాధ్యత తీరిపోతుంది. తరువాత నేనేమయినా విచారించేవాళ్ళు లేరు. ఒక కట్నం తప్ప, దాని పెళ్ళికి అన్ని ఏర్పాట్లూ జరిగిపోయినయ్. నా యిల్లు తాకట్టుపెట్టుకుని పైకం సర్దుబాటు చేస్తానని మాటిచ్చిన పెద్ద మనిషి ఇప్పుడు ససేమిరా కుదరదంటున్నాడు. నాకు అప్పు పెట్టడానికి ఎవరూ ముందుకి రావడంలేదు ఏంచెయ్యాలో తోచడం లేదు పదివేల రూపాయలు! ఎక్కడ్నించి తేను? నాకు ఒకే పొక్క మార్గం కనిపిస్తోంది!"

"ఏమిటా మార్గం?"

"నాకు దూరపు బంధు పొకాయన వున్నాడు. ఆయన దగ్గర డబ్బు మూలుగుతోంది. ఈ మధ్య ఎక్కడో ఇంటి స్థలం కొనాలని బాంకులోంచి ఇరవైవేలు డ్రాచేసి ఇనప్పెట్టెలో దాచాడు. బేరం కుదర్లేదేమో ఆ యిరవై వేలూ ఇనప్పెట్టెలోనే మూలుగుతోంది. ఆ యిరవై వేలూ స్వాధీనం చేసుకుంటే మనిద్దరికీ ఉపయోగపడుతుంది. వాగండం

గడుస్తుంది. నీ జీవితం కుదుటపడుతుంది నీ వాటాలో సంఘంలో నాకున్న పలుకు బడిలో నువ్వు యీ జీవిత విధానానికి స్వస్తిచెప్పి గౌరవంగా బ్రతకవచ్చు."

"ఏమిటి? ఆ యిరవై వేలూ స్వాధీనం చేసుకోవాలా?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు

"అవును. అందువల్ల అతడు చెడి పోయ్యేదేమీ లేదు. ఇరవై వేలు అతనికో లెక్కలోనిది కాదు పైగా మన జీవితాలు బాగుపడతయ్ నేను ఆ యింట్లోనే పని చేస్తున్నాను. నీకు ఎలాంటి ప్రమాదమూ జరక్కుండా నేనన్ని ఏర్పాట్లూ చెయ్య గలను నీ ప్రయత్నం జయప్రదం కావడనికి నా సహకారం పూర్తిగా లభిస్తుంది. చెప్పు బాబూ, నీకే అభ్యం తరమూ లేదు. కదూ?" అన్నాడావ్యక్తి.

"నేనా యింట్లో దొంగతనం చెయ్యాలా?"

"అవును బాబూ! తప్పదు! మన జీవితాలు బాగుపడాలంటే గత్యంతరం లేదు. నాకు తెలుసు, నువ్వీ కార్యాన్ని జయప్రదంగా నిర్వహించగలవు. నీకా అనుభవం వుంది. ఆ నమ్మకంతోనే నేనిక్కడికి వచ్చాను"

రాము ఆలోచన్లో పడ్డాడు.

"ఏమిటి బాబూ, ఏమిటాలోచిస్తు న్నావ్?"

"నా గురించి మీరింత క్షుణ్ణంగా ఎలా తెలుసుకున్నారు! నేను నా జీవిత విధానాన్ని మార్చుకుని గౌరవంగా బ్రతకాలని నిర్ణయించుకున్న మాట నిజమే కాని మీ కివన్నీ ఎలా తెలిసిందో నాకర్థంకావడం లేదు.

"చెబుతాను. మొన్న రాత్రి నువ్వు కోఠీ నుండి వచ్చే బస్సులో, అంటే దాదాపు ఎనిమిది గంటలప్పుడు, ప్రయాణం చేశావు కదూ!" అని ప్రశ్నించాడా వ్యక్తి.

రాము అవునన్నట్టు తలూపాడు.

"బస్సులో జనం బాగా రద్దీగా వున్నారు బస్సు అబిడ్స్ స్టాపు చేరుకునే సరికి, ఆ రద్దీలో వాడుపు చూచుకుని, పక్కనున్న వ్యక్తి జేబులోంచి పర్సు కొట్టేసి స్టాపులో దిగిపోయ్యావు."

రాము ముఖంలో నెత్తుటి చుక్క లేదు.

"జెనరల్ పోస్టాఫీసు పక్క సందులో నువ్వూ నీ మిత్రులూ కలుసుకుని పర్సు తెరిచి చూశారు. అందులో రెండు పది రూపాయల నోట్లూ కొంత చిల్లరా తప్ప ఎక్కువేమీ లేదు. పర్సు తాలుకు వ్యక్తిని తిట్టుకుంటూ మీరు ముగ్గురూ ఓ హోటల్ కేసి నడిచారు. హోటల్లో కూచుని టిఫిన్ చేసి మళ్ళీ బస్‌స్టాప్ చేరుకున్నారు. బస్సెక్కి తిన్నగా సికింద్రబాద్‌లో దిగి క్లాక్‌టవర్ దగ్గ రున్న ఓ పార్కులోకి చేరుకున్నారు. అక్కడ దాదాపు అరగంట సేపు మీ ముఠావ్యక్తుల కోసం ఎదురు చూస్తూ

తూచున్నారు. చివరికి విసుగెత్తి మీ ముగ్గుర్లో ఒకడ్ని గార్డెర్ రెస్టారెంటు దాకా వెళ్ళి చూచిరమ్మని చెప్పారు. అతడటు వెళ్ళగానే మీ యిద్దరూ మీ రహస్యాలు బైటపెట్టుకున్నారు.

"మీ ముఠాలోని వ్యక్తులందరూ నిన్న సాయంత్రం హైదరాబాద్ నుండి మద్రాసుకి వెళ్ళే రైలో వెళ్ళిపోయ్యారు. చివరిపెట్టెలో ఫుట్‌బోర్డుమీద నిల్చుని నువ్వు సికింద్రాబాద్ స్టేషన్ నుండి రైలు కదలగానే ఫుట్‌బోర్డు నుంచి మెల్లగా క్రిందికి జారుకున్నావు. నువ్వు ఆ ముఠాలోంచి బైటపడడానికి నీ మిత్రుడు నీకు అన్ని విధాలా సాయం చేశాడు" అతడు చెప్పడం ఆపాడు.

"ఇదంతా మీ కెలా తెలుసు?" రాము విస్తుపోయి అతనికేసి చూస్తూ వుండిపోయ్యాడు.

"బస్సులో పర్సు పోగొట్టుకున్న వ్యక్తిని నేనే."

"మీరా? నేను మీ జేబులోంచి పర్సు కొట్టెయ్యడం మీరు గమనించారన్న మాట?"

"అవును మరొకరైతే అరిచి అల్లరి చేసి నిన్ను పోలీసులికి అప్పజెప్పి వుండేవారు. కాని నేనలా చెయ్యలేదు. కారణం ఏమిటో మీకు తెలుసా?"

రాము తెలీదన్నట్టు తల అడ్డంగా వూపాడు.

"నేను నీలాంటి వ్యక్తి కోసమే గాలిస్తున్నాను. నా అదృష్టం కొద్దీ నువ్వు కనిపించావు. అలాంటప్పుడు నిన్ను పోలీసులికి అప్పజెబితే లాభమేమిటి? అందుచేత నేనే నీ వెంటబడి నీ రహస్యం తెలుసుకున్నాను. నువ్వెలాగూ యీ జీవిత విధానాన్ని వొదులుకోదలచు కున్నావు గనక ఏ వుద్యోగమో సద్యోగమో దొరికేదాకా బ్రతకడానికి పైసా కావాలి. నేను ప్రస్తుతం పేదవాడ్నయినా ఒకప్పుడు బాగా బ్రతికినవాడ్ని. సంఘంలో కాస్తో కూస్తో పలుకుబడి వుంది. చివరిసారిగా నువ్వీ ప్రయత్నం చేసి, యీ జీవిత విధానానికి స్వస్తి చెప్పి బైటపడతే మనిద్దరికీ ప్రయోజన కారిగా వుంటుంది నేను నా జీవితకాలం నీకు అండగా నిలుస్తాను. నా పలుకు బడినంతా వినియోగించి అటు నీ ముఠా వ్యక్తులవల్లగానీ ఇటు పోలీసులవల్ల గానీ నీకు అపకారం జరక్కుండా చూచుకుంటాను ఏమంటావ్?"

రాము ఆలోచిస్తూ వుండిపోయ్యాడు.

అతనికి దొంగబ్రతుకు మీద మొదటి నుండీ అసహ్యంగానే వుంది. ఈ ముఠాలోంచి బైటపడాలని చాలా రోజులుగా అనుకుంటూనే వున్నాడు. తమ ముఠా యీవూళ్ళో అడుగుపెట్టి నప్పటి నుండి తన వాంఛ తీవ్రం కాజొచ్చింది ఈ వూళ్ళోని వీధులూ, బజార్లూ, మనుషులూ, వాళ్ళ వేషభాషలూ యివన్నీ తనని బాగా ఆకర్షించినయ్.



తనకీ యీ వూరికీ ఏదో అవినాభావ సంబంధం వున్నట్టు ఏదో భావన. తానీ వూళ్ళోంచి బైటపడకూడదన్న బలీయమైన వాంఛ తన్ని ప్రయత్నానికి పురికొల్పింది. తన మిత్రుడు దిలీప్ కూడా తన ప్రయత్నానికి దోహదం చేశాడు. తన ప్రయత్నం ఫలించింది. కాని తాను తన ముఠాలోంచి బైటపడగానే బ్రతకడం ఎలా? అన్న దిగులు పట్టుకుంది. అలాంటి సమయంలో యీ వ్యక్తి దేవుడిలా సాక్షాత్కరించాడు. తన బ్రతుక్కి ఓ వెలుగుబాటని చూపిస్తానంటున్నాడు. బహుశా తన బ్రతుకులో మార్పు రావడానికిది నాంది కావచ్చు. వెదుక్కుని వచ్చిన అదృష్టాన్ని కాలదన్నడం అవివేకమే అవుతుంది!—

"మీరు నా భవిష్యజ్జీవితానికి అండగా నిలుస్తానంటే నేనీ పనికి పూనుకోవడానికి సిద్ధంగానే వున్నాను" అన్నాడు రాము.

"నువ్వు చాలా తెలివయిన వాడివి బాబూ! నువ్వీ ప్రయత్నంలో తప్పకుండా విజయం సాధిస్తావు. నీ భవిష్యత్తు వుజ్జ్వలంగా ప్రకాశిస్తుందని మనసారా దీవిస్తున్నాను. ప్రస్తుతానికి నువ్వు నిశ్చింతంగా విశ్రాంతి తీసుకో. రేపు సాయంత్రం నేను నిన్ను కలుసుకుంటాను. మన కార్యక్రమాన్ని గూర్చి కూలంకషంగా చర్చించుకుందాం" అంటూ ఆ వ్యక్తి కుర్చీలోంచి లేచి వెళ్ళిపోయాడు.

2

రాత్రి ఒంటిగంట దాటింది. ప్రపంచమంతా నిశాకాంత వాడిలో మైమరచి నిద్రపోతోంది. చలికాలం కావడం మూలాన వీధులు నిర్మానుష్యంగా

వున్నాయ్. కార్పొరేషన్‌వారి విద్యు ద్దీపాలు బిక్కుబిక్కుమంటూ వెలుగు తున్నాయ్. విశాలమైన తారు రోడ్లు నిశ్చింతంగా విశ్రాంతి తీసుకుంటున్నాయ్.

రాము తన లాడ్జిలోంచి బైటపడి తారురోడ్డుమీద నడుస్తున్నాడు. అతడు వడివడిగా నడుస్తూన్నప్పటికీ అంత నిశ్శబ్దంలో సైతం అతని అడుగుల చప్పుడు వినిపించడంలేదు. అతడు తొడుక్కున్నది కాన్వాస్ షూస్ కావడం మూలాన అడుగులు మెత్తగా పడు తున్నాయ్.

మెయిన్ రోడ్డు మలుపు తిరిగి క్రాస్ రోడ్డులోకి చేరుకున్నాడు. రోడ్డు అంచున కార్పొరేషన్‌వారి దీపస్తంభం క్రింద ఆగి వొక్కసారి వీధికేసి తేరిపార చూచాడు. స్తంభాని కెదురు వరుసలో వీధి చివరినుండి మూడవ ఇంటిముందు కాంపౌండులో రెండు కొబ్బరిచెట్లు గేటుకి అటూ యిటూ ఐవాన్లకి మల్లే నిల్చుని వున్నాయ్. గేటు ఆర్చిమీద అల్లుకున్న మల్లెతీగలు కాటోలు గాలికి తలలూపు తున్నాయ్. కాంపౌండులో చీకటి రాజ్యం చేస్తోంది. మేడమీద అద్దాల తలుపు ల్లోంచి దీపపు కాంతి ప్రసరిస్తోంది.

రాము వొక్కసారి నలుదిక్కులా పరికించి, తన్నెవరూ గమనించడం లేదన్న విషయాన్ని రూఢిచేసుకుని, మెల్లగా ఆ యింటివద్దకి చేరుకున్నాడు గేటువద్ద ఆగి మూసిన గేటు తలుపుల్ని మెల్లగా తోశాడు. లోపల గడియవేసి వుంది కాటోలు తలుపులు కదల్లేదు. క్రింది భాగంలో ఎవరూ లేరు కాటోలు కిటికీల్లోంచి కూడా వెలుతురు కనిపించడం లేదు.

రాము మరొక్కసారి దిక్కులు పరి కించి, ఒక్క వూపున గోడెక్కి కాంపౌండులోకి అతి సునాయాసంగా దూకేశాడు. కాంపౌండులో వెలుతురు లేకపోవడం మూలాన పైకి వెళ్ళే మార్గం వెతకడంలో అట్టే కష్టమని పించలేదు. ఇంటి వెనుక బాత్‌రూము నానుకుని మురికినీటి గొట్టం పైకి వెళు తోంది. రాము ఒక్కసారి ఆ పైప్‌కేసి మేడమీద రెయిలింగ్‌కేసీ దృష్టి సారించి తొడుక్కున్న కాన్వాస్ షూస్ సైతం విప్పకుండానే గబ గబా గొట్టంమీదికి ప్రాకసాగాడు. గొట్టంమీంచి రెయి లింగ్ నందుకుని సునాయాసంగా మేడ మీదికి చేరుకోగలిగాడు.

మేడమీద హాల్లో దీపం వెలుగుతోంది. రాము అడుగుమీద అడుగేసుకుంటూ అతి జాగ్రత్తగా హాలుకేసి నడిచాడు. హాలు తాలూకు ఫ్రెంచ్‌విండో బార్ల తెరిచివుంది. రాము మెల్లగా విండో దగ్గరికి చేరుకుని గ్లావ్‌డోర్ మీద వ్రేళ్ళతో టకటక లాడించి చప్పుడు చేశాడు చప్పుడు విని ఎవరూ కదిలినట్టు అలికిడి కాలేదు. మెల్లగా విండోలోంచి లోపలికి తొంగిచూశాడు. హాలు మధ్య

పరిచిన చాపమీద వెల్లకిలా పడుకుని నిద్రపోతున్నాడో వ్యక్తి. బహుశా నౌకరు కాబోలు.

రాము మరోసారి కిటికీ తలుపుమీద చప్పుడుచేసి నౌకరు గాఢనిద్రలో వున్నాడన్న విషయాన్ని రూఢీచేసుకుని, ధైర్యంగా కిటికీ మీద కెక్కి శబ్దం కాకుండా లోపలికి జారాడు. అడుగుమీద అడుగేసుకుంటూ వెళ్ళి నౌకరు దగ్గరికి చేరుకున్నాడు. జేబులోంచి కర్చీఫ్ తీసి అతని ముక్కుకి అదిమిపెట్టి రెండు సెకండ్ల కాలం వుంచి మెల్లగా అక్కడ్నించి కదిలాడు. కుడి వైపున వున్న గది దగ్గరికి చేరుకుని మూసిన తలుపుల్ని మెల్లగా తోశాడు. లోపల గడియపెట్టకపోవడం మూలాన తలుపులు తెరుచుకున్నాయ్. గదిలో నీలం రంగు బెడ్ రూము లైటు వెలుగుతోంది రెండు మంచాలమీద ఇద్దరు వ్యక్తులు ముసుగులు తన్ని పడుకుని వున్నారు. రెండు మంచాలకి మధ్య ఓ టీపాయ్ వుంది. టీపాయ్ మీద ఫ్లవర్ వాజ్ కనిపించింది

రాము అతి జాగ్రత్తగా అడుగులు వేస్తూ టీపాయ్ దగ్గరికి చేరుకుని, ఫ్లవర్ వాజ్‌ని చేతిలోకి తీసుకున్నాడు. వాజ్ లోని ప్లాస్టిక్ పూలగుత్తిని తొలగించి, వాజ్‌లోంచి తాళాల గుత్తిని పైకితీశాడు. ఫ్లవర్ వాజ్‌ని యథాప్రకారం టీపాయ్ మీద పెట్టి తాళాల గుత్తితో గదిలోంచి బైటపడి తలుపులు రెండూ మూసి, బైట గొళ్ళెంపెట్టి, ధైర్యంగా ఎడమ వైపున వున్న గదికేసి నడిచాడు

మూసిన గది తలుపులకి ఓ చిత్రమైన తాళం కప్ప వ్రేలాడుతోంది. తాళంకప్ప మీద నాలుగు వరుసల్లో, వరుసకి ఆరేసి చొప్పున మొత్తం ఇరవైనాలుగు మీటలు బటాణీ గింజల సైజులో వున్నాయ్. ఒక్కో మీటమీద ఒక్కో ఇంగ్లీషు అక్షరం A నుండి వరుసగా X వరకు తెల్లగా మెరుస్తున్నాయ్

రాము తనకి బాగా పరిచయమున్న వాడికి మల్లే తాళం కప్పని చేతిలోకి తీసుకుని, వరుసగా R-A-M-U అనే అక్షరాలను నొక్కాడు. తాళం కప్ప కిమ్మనకుండా చేతిలోకి వూడివచ్చింది.

రాము తలుపులు తెరిచి గదిలోకి నడిచాడు. ఎదురుగా లక్ష్మీపరం మీద చిన్న జీరో వాట్ బల్బు వెలుగుతోంది వెలుతురు ఎక్కువగా లేకపోవడం మూలాన గదిలో ఎక్కడ ఏముందీ స్పష్టంగా కనిపించడంలేదు. అందుచేత తెరిచిన తలుపులు దగ్గరికివేసి స్విచ్ బోర్డు నొక్కి గదిలో దీపం వెలిగించాడు. ఎదురుగా కనిపిస్తోన్న లక్ష్మీపరం క్రిందనే వుంది ఇనప్పెట్టె!

రాము తిన్నగా ఇనప్పెట్టె దగ్గరికి చేరుకుని తాళం చెవుల సాయంతో ఇనప్పెట్టె తలుపులు తెరిచి సొరుగులన్నీ లాగి చూశాడు. ఓ సొరుగులో

వెండి సామానూ మరో సొరుగులో బంగారు నగలూ ప్రత్యక్షమయినయ్. కాని రాము వాటిని ముట్టుకోలేదు. మరో సొరుగు లాగాడు. అందులో రెండు వంద రూపాయల కట్టలు కొత్తవి దర్శనమిచ్చాయి. అతని కళ్ళు మెరిశాయి. ఆ రెండు కట్టల్నీ తీసి తన రెండు జేబుల్లోనూ కుక్కుకుని, సొరుగుల్ని మూస్తుండగా, ఎక్కడ్నించో సన్నగా, కర్ణపేయంగా, ఏదో సంగీతం వినిపించ సాగింది.

'కోడి వొక కోనలో- పుంజు వొక కోనలో
పిల్ల లేమొ తల్లడిల్లె- ప్రేమలేని కానలో'

రాము ఆ పాట వింటూ తన్ను తాను మరిచిపోయ్యాడు తన్మయత్వంలో వుండిపొయ్యాడు. అతనికి తెలీకుండానే కళ్ళల్లోంచి అశ్రువులు చెంపల మీద కాలువలు కట్టాయి.

కొంత సేపటికి పాట ఆగిపోయింది. కాని రాము అక్కడ్నించి కదల్లేదు. అతని స్మృతిపథంలో తన బాల్య స్మృతులు సినిమా రీలుకి మల్లే కదల సాగాయి.

అప్పుడు తనకి ఎనిమిదేళ్ళుంటాయేమో ఓ సాయంత్రం తాను స్కూలు నుండి ఇంటికి తిరిగివచ్చేసరికి, ఎప్పుడూ గుమ్మంలో నిల్చుని తనకోసం ఎదురు చూచే అమ్మ కాడ కనిపించలేదు ఇల్లు బోసిగా ఏదో పోగొట్టుకున్నదానికి మల్లే కనిపించింది. నౌకర్లు ఓ మూల కూలబడి గుసగుస లాడుకుంటున్నారు. తాను అమ్మ కోసం గాలిస్తూ అమ్మ గదిలోకి వెళ్ళేసరికి, మంచం మీద పడుకుని దిండులో తల దూర్చి వెక్కి- వెక్కి- ఏడుస్తోంది. అమ్మ ఎందుకు ఏడుస్తోందో తనకి అర్థంకాలేదు. తనకీ ఏడుపు ముంచుకొచ్చింది. బావురుమని ఏడుపు లంకించుకున్నాడు.

అమ్మ ఏడవడం ఆపి, తన్ను ఓదార్చి తిన్నగా బాత్‌రూముకేసి నడిచింది. ఐదు నిమిషాల్లో బట్టలూ అవీ సర్దేసుకుని తన్ను వెంటపెట్టుకుని స్టేషన్‌కేసి బయలుదేరింది. నౌకర్లు అమ్మ వెంట స్టేషన్ దాకా వచ్చి సాగనంపారు తామూ ఆ రాత్రే అమ్మమ్మగారి యిల్లు చేరుకున్నారు.

అమ్మమ్మ అమ్మని ఏవేవో ప్రశ్నలు వేసింది. ఆ తరువాత అమ్మా అమ్మమ్మా యిద్దరూ కలిసి కొంతసేపు ఏడ్చుకున్నారు. తాతయ్య మాత్రం ఎవరి మీదనో కారాలు మిరియాలు నూరుతూ కాలుగాలిన పిల్లిలా ఇంట్లోకి బైటకి తిరుగుతూ పెద్ద పెద్దగా మాట్లాడుతున్నాడు.

అమ్మా తానూ అమ్మమ్మగారింట్లోనే వుండిపొయ్యారు తాతయ్య తన్ను ఆ వూళ్ళోనే స్కూల్లో చేర్పించాడు తనకి అక్కడ హాయిగానే వుండేది అమ్మమ్మ



తన్ని ముద్దుచేసేది. తాతయ్య తనకి చాక్లెట్లూ, బిస్కెట్లూ ఏవేవో కొని పెట్టేవాడు. ఎదురింటి పిల్లాళ్ళతో తాను ఆడుకునేవాడు. కాని అమ్మ మాత్రం అప్పుడప్పుడూ ఓ మూల చేరి కంట తడి పెట్టుకునేది.

అలా ఒక్క సంవత్సరం గడిచిపోయిందేమో, ఒకనాటి సాయంత్రం తాను స్కూలు నుండి యింటికి వెళ్ళుతుండగా దార్లో నాన్నగారు కనిపించారు తనకోసం పళ్ళూ మిఠాయీలూ, బొమ్మలూ ఏవేవో కొని తెచ్చారు. 'ఇవన్నీ నీకే బాబూ, మనం మనింటికెళదాం అక్కడ నీకింకా బోలెడు కొని పెడతాను; వొస్తావా?' అన్నాడు. ఆ బొమ్మల్ని చూసేసరికి అమ్మను మరిచిపోయి 'అలాగే' అన్నాడు. నాన్నగారు తన్ని కార్లో తన ఇంటికి తీసుకు వెళ్ళిపోయాడు.

అంతే తన బ్రతుకు వొంటరి బ్రతుకై పోయింది. స్కూలు కెళ్ళి ఇంటికి తిరిగి వచ్చేసరికి అమ్మకి బదులు ఆయా ఎదురొచ్చేది. తనకేది కావాలన్నా ఆయాని అడగాల్సిందే. నాన్నగారు ఎప్పుడో తప్ప కనిపించేవారు కారు. అమ్మని చూడాలని వుందంటే కసిరికొట్టేవారు. "నీకెక్కడేం తక్కువైంది? దాని పేరెందుకెత్తుతావ్" అనేవారు. అమ్మని తలుచుకుని తాను కుమిలికుమిలి ఏడ్చేవాడు. నవుకర్లు తన్ని ఓదార్చేవారు.

ఒకరోజు ఆయాతో బాటు తాను సినిమాకి వెళ్ళాడు. ఆ సినిమా పేరేమిటో తనకి గుర్తులేదు. ఆ సినిమా చూస్తున్నంతసేపూ అమ్మ తనకళ్ళముందు కదు

లాడుతూనే వుంది. తనకి తెలికుండానే తన కళ్ళల్లోంచి కన్నీరు కారుతూనే వుంది. అందులోనే యీ పాట! యీ పాటంటే తనకెంతో ఇష్టం! రేడియోలో యీ పాట వినిపించినప్పుడల్లా తాను సర్వస్వం మరచిపోయి వెక్కి వెక్కి ఏడ్చేవాడు.

అమ్మను చూడాలన్న కోరిక తనలో రోజు రోజుకీ తీవ్రం కాజొచ్చింది. నాన్నగారి నడిగితే పంపరు సరికదా, కొప్పడతారు కూడా అందుచేత ఎవరికీ తెలీకుండా ఇంట్లోంచి పారిపోయి అమ్మను చూడాలని నిశ్చయించు కున్నాడు

ఒకనాటి సాయంత్రం స్కూల్లోంచి ఇంటికి రాకుండా అటే స్టేషన్ కెళ్ళి, అమ్మమ్మగారి వూరికి టిక్కెట్టు తీసుకుని రైలెక్కాడు. రైలు అమ్మమ్మ గారి వూరు చేరుకోవడం ఆలస్యంకావడం మూలాన, ఆ రాత్రి భోజనం చెయ్యక పోవడం మూలాన వొళ్ళు మరిచి నిద్ర పొయ్యాడు

ఆ నిద్రలో ఎవడో రాక్షసుడు తన కబంధహస్తాలతో అమాంతం పైకెత్తి, ఏ అఘాతంలోకో విసిరివేసినట్టయింది. అంతే, తన కేమీ గుర్తులేదు కొంత కాలం హాస్పిటల్లో పడివున్నాడు. తనకు నయమైన తరువాత ఎవరో తన్ను తమ వెంట తీసుకెళ్ళారు వాళ్ళే తిండీ బట్టా యిచ్చేవారు. వాళ్ళు ఏం చెబితే అది చేసేవాడు. గతం తనకి గుర్తులేదు. ఇప్పటిదాకా ఆ ముఠా చెప్పుచేతల్లోవుండి యీ దొంగబ్రతుకు బ్రతుకుతున్నాడు

తల్లి, తండ్రీ, అమ్మమ్మా, తాతయ్యా ఎవరూ తనకి గుర్తులేదు. వాళ్ళెవరో ఎక్కడున్నారో తనకి తెలీదు ఇప్పుడు ఈపాట వినేదాకా తన గతం తనకి గుర్తులేదు. తన తల్లి ఎవరో, ఆమె ఎక్కడుందో? తన తండ్రి యిప్పటికైనా ఆమెను చేరదీశాడో లేదో!—

రాము ఆలోచిస్తూ మెల్లగా వెనక్కి తిరిగాడు. ఎదురుగా గుమ్మంమీద గోడకి వ్రేలాడుతోన్న పెద్దసైజు ఫోటో మీద పడింది తని దృష్టి. కళ్ళు పెద్దవిచేసి ఆ ఫోటో కేసే దృష్టి సారించి "అమ్మా!" అని గట్టిగా కేకపెట్టి నేల విరుచుకు పడ్డాడు. తల గోడకి కొట్టుకుని రక్తం చిమ్మింది. దాంతో అతడు స్పృహ కోల్పొయ్యాడు.

రాము కళ్ళు తెరిచే సరికి తాను తన తల్లి వొడిలో వున్నాడు తల్లి పక్కనే నిల్చుని ఆత్రంగా అతనికేసి చూస్తు న్నాడు తండ్రి. అపరిచిత వ్యక్తి కూడా అక్కడే వున్నాడు.

"అమ్మా!" అన్నాడు రాము ఆప్యాయంగా.

"అవును బాబూ! నేను మీ అమ్మనే. ఎలావుంది బాబూ?" అంది తల్లి అతని తలకి కట్టిన కట్టును సున్నితంగా నిమురుతూ.

"నాకేం? బాగానే వుందమ్మా! ఇంతకీ నువ్విప్పుడెక్కడున్నావమ్మా? నాన్నగారు నిన్ను యింకా తీసుకెళ్ళ లేదా? నువ్వింకా అమ్మమ్మగారింట్లోనే వున్నావా!

"నాన్నగారు పూర్తిగా మారిపోయారు బాబూ! నేనిప్పుడు మనింట్లోనే ఉన్నాను. ఇది మనిల్లే బాబూ!" అంది తల్లి చెమ్మ గిల్లిన కళ్ళని పమిటచెంగుతో తుడుచుకుంటూ.

"అవును బాబూ! నేను దుర్మార్గుడిని అందువల్ల నేను ఇంతకాలం పుత్రశోకం అనుభవించాల్సివచ్చింది," అన్నాడు తండ్రి పూడిపోయిన గొంతుకతో.

రాము తృప్తిగా వూపిరి పీల్చుకున్నాడు. "అయితే ఇంతకాలం మీరేమయ్యారు? నేనిక్కడి కెలా వచ్చాను? ఇప్పుడు నాకేమయింది?" ప్రశ్నలవర్షం కురిపించసాగాడు. వెంటనే ప్రక్కకి తిరిగి అపరిచిత వ్యక్తికేసి తేరిపార చూచి "మీరు మా లాయర్ విశ్వనాథం గారు కదూ?" అని ప్రశ్నించాడు.

లాయర్ విశ్వనాథం చిన్నగా నవ్వి, "అవును బాబూ! నేను విశ్వనాథాన్నే! నీకేమయిందో! ఇంతకాలం మేమంతా ఏమయ్యామో వివరంగా చెబుతాను. విను!" అన్నాడు గొంతు సవరించుకుని చెప్పడం మొదలుపెట్టాడు. "దాదాపు ఎన్నిమిదేళ్ళనాటి మాట! అప్పుడు నీకు పదేళ్ళుంటాయేమో. ఒకనాడు స్కూలు నుండి ఇంటికి రాకుండా అమ్మను చూడాలన్న కోరికకొద్దీ అమ్మమ్మగారి వూరికి బయలుదేరిన విషయం నీకు జ్ఞాపకం వుండొచ్చు. నీవు ప్రయాణంచేసిన రైలు మీ అమ్మమ్మగారి వూరిసమీపంలో ప్రమాదానికి గురికావడం, నీకా ప్రమాదంలో తలమీద బలమైన దెబ్బ తగలడం మూలాన జ్ఞాపకశక్తి పోగొట్టుకున్నావు. అంతే గతాన్ని పూర్తిగా మరచిపోయ్యావన్న మాట! నువ్వెవరో నీ తల్లిదండ్రులెవరో, వాళ్ళెక్కడుంటారో మొదలయిన వేవీ నీకు గుర్తులేదు అలాంటి స్థితిలో ఓ దొంగలముఠాచేత చిక్కుబడిపోయావు వాళ్ళే నీ తలమీద గాయాన్ని నయంచేసి నిన్ను తన ముఠాలో చేర్చుకున్నారు. జేబులు కొట్టడం, దొంగతనాలు చెయ్యడం నీనైజానికి విరుద్ధమైనా పరిస్థితుల ప్రభావంతో నువ్వు చెయ్యక తప్పిందికాదు మీ ముఠా యీ వూళ్ళో అడుగుపెట్టిన మొదటి రోజే నాకంట బడడం, అందులో నువ్వుండడం, నిన్ను నేను గుర్తుపట్టడం వల్ల, నేను అనుక్షణం మిమ్మల్ని రహస్యంగా వెంటాడుతూ మీ అందరి రహస్యాలూ తెల్సుకోగలిగానే నీకీ జీవిత విధానం మీద విరక్తి పుట్టిందనీ, యీ ముఠాలోంచి తప్పించుకు బైటపడాలని నువ్వు ప్రయత్నించడం నాకెంతో సంతోషాన్ని కలిగించింది.

"అయితే నువ్వు నిజంగా మా

రాముపో, లేక అలాంటి రూపురేఖలున్న మరో వ్యక్తివో తెలుసుకునేందుకు చిన్న నాటకం ఆడాను. ఎలాగైతేనేం, నా ప్రయత్నం ఫలించింది.

"ఇనప్పెట్టె వున్న గది తలుపుకి వ్రేలాడుతోన్న తాళం కప్పను నీపేరుతోనే తెరవాలి. ఆ విషయం నాకూ మీ యింట్లోవాళ్ళకి తప్ప మరెవ్వరికి తెలీదు. నువ్వా తాళంకప్పవి అతిసునాయాసంగా తెరవడంతో నువ్వు రామూ వేనన్న విషయం తేలిపోయింది.నీకా తాళం కప్ప చిన్నప్పటినుండీ పరిచయమేగనక అట్టే ఆలోచించకుండా తెరవగలిగావు

"చిన్నప్పుడు ఏపాటనైతే నువ్వు మరీమరీ వినాలని కోరుకునేవాడివో ఆ పాట విన్న కదిలించివేయడం, మీ తల్లిగారి ఫొటోవి నువ్వు గుర్తుపట్టడం మొదలైన సంఘటనలు కూడా నైవిషయాన్నే బలపరచాయి. ఎలాగైతేనేం నువ్వు మీ తలిదండ్రులికి దక్కావు" అన్నాడు లాయర్ విశ్వనాధం సంతృప్తిగా.

"ఇదంతా లాయర్‌గారి చలవే బాబూ. వారు మన శ్రేయోభిలాషులు గనక యింత శ్రమకోర్చి నిన్ను మళ్ళీ ఇల్లు చేర్చగలిగారు. వారికి మన కుటుంబం యావత్తు ఋణపడిపొయ్యాం ! ఈ ఋణాన్ని ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేము" అన్నాడు రాముతండ్రి కృతజ్ఞతా పూర్వకంగా.

"అంతా దైవేచ్ఛ! ప్రయత్నం మనదే కాని ఫలితం మన చేతుల్లో లేదు. మనకి దైవానుకూలం వుండబట్టే తప్పిపోయిన రాము మళ్ళీ మన కంటబడడం జరిగింది. అతడు మన జ్ఞాపకశక్తిని పుంజుకోవడం మామూలు విషయం కాదు. తన తల్లి ఫోటోని చూసి, సర్వస్వం మరచిపోయి క్రింద కూలడం, తలకి దెబ్బ తగలడం మళ్ళీ తన పూర్వస్మృతుల్ని పుంజుకోవడం యివన్నీ చూస్తోంటే మానవ ప్రయత్నం పేరుకి మాత్రమేనని పిస్తోంది!" అన్నాడు లాయర్ విశ్వనాధం.

అందరూ ఒకసారి ఆ భగవంతుడికి మనసులోనే కృతజ్ఞతలు చెప్పుకున్నారు.